# తలకాయ మాస్టారు

◆ మహర్షి ◆

హెడ్ మాస్టారు గబుక్కున కళ్ళజోడు తీసి పంచెను సర్రున పైకిలాక్కుని అద్దాలను తుడుచుకుంటుండగా హిందీ టీచర్ షకీలా బాలు చటుక్కున గదిలో కొచ్చి నమస్కారం చేయబోయి కెవ్వున అరిచింది.

రెండు చేతులతో కళ్ళు మూసుకుని, అంతలోనే సిగ్గుపడి వంకర్లు తిరిగిపోతున్నది. ఆమె అరుపుకు ఉలిక్కిపడిన హెడ్ మాస్టారు కంగారుగా పంచెను క్రిందకు లాక్కుని "ఎందుకలా అరచి చచ్చావ్ నేనేమైనా రేప్ చేసి చచ్చే వాడిలా కనబడి చస్తున్నావా? మరీ అలా భయపడిచావకు. లోపల చారల డ్రాయరు చచ్చింది. అయినా ఎక్కడబడితే అక్కడ ఎలా బడితే అలా అరిచి చావకూడదు. ఎవరైనా వింటే నేను చేయిపట్టుకు చచ్చాననుకుంటారు. డిసిప్లేన్ కాస్తలో కాస్త అయినా మెయిన్ టెయిన్ చేసి చావాలి. ఈ టైమ్‌లో ఇక్కడేం చేసి చస్తున్నావ్?" రుసరుసలాడాడు హెడ్‌మాస్టారు.

"ఏం లేదండి. మీకు నమస్కారం చేసి చద్దామని... చ.చ. మీకు విష్ చేద్దామని వచ్చాను" కంగారుగా చెప్పింది షకీల.

"చేసి చచ్చింది చాలు. అవును నువ్వసలు టీచరువేనా? నీ కులుకులు, ఈ వేషాలు చూసి పిల్లలు నీకు లైటింగ్ కొట్టినా కొట్టి చస్తారు. రేపటి నుండి ఈ వేషాలు తగ్గించిచావు. బ:సట ఎండగా వుండి గొడుగు వేసుకుచచ్చావు బాగానే వుంది. మరి లోపలకొచ్చిన తరువాత తీసి చావచ్చు కదా!" అన్నాడు కోపంగా.

షకీల కంగారుగా గొడుగును ముడిచి పట్టుకున్నది.

"బాగుంది ఇక క్లాస్‌కు వెళ్ళిచావు. పిల్లలు గోల చేసి చస్తుంటారు" అని ముందున్న బుక్ ఓపెన్ చేశాడు.

సరసం తెలియని వాడికి సంపంగి పువ్విస్తే .... వేసుకున్నాడట హు అనుకుంటూ వెళ్ళిపోయింది షకీలా.

★ ★ ★ ★

ప్రక్క క్లాస్‌లో పిల్లలు గొడవ గొడవ చేస్తుంటే అది భరించలేక కోపంగా బెల్ నొక్కాడు హెడ్ మాస్టారు. రెండు నిముషాలు గడచినా అటెండర్ అప్పారావు రాలేదు.

"ఒరేయ్ అప్పిగా! అప్పిగా ఎక్కడ చచ్చావురా!" బిగ్గరగా అరిచాడు.

ఓ మూడు నిముషాల తరువాత మెల్లగా వచ్చాడు. "ఏరా చెవిటి వెధవా ఎక్కడ చచ్చావురా?" గుడ్లు మిటకరించి మరీ అరిచాడు హెడ్‌మాస్టారు.

"పిలిచారా?" మెల్లగా అడిగాడు అప్పారావు.

"లేదు. అరచి చచ్చాను. ఆ క్లాస్‌లో పిల్లలు అలా అరచి చస్తున్నారు ఏ మొచ్చి చచ్చింది. ఇది క్లాసా లేక బందులదొడ్డా? వెళ్ళి తెలుగు మాష్టార్ని పిలుచుకు చావు" పెద్దగా అరచి చెప్పారు. అయినా ఒక్క మాట వినబడలేదు అప్పారావుకు.

"మూకీ సినిమావలె అలా పెదాలు కదుపుతారేంటి? నాకు మూగ భాషరాదు" విషయం చెప్పండి అన్నాడు అప్పారావు.

"ఓరి నీ బ్రహ్మ చెవుడు నాశనం కాను. నేను నీతో అరచి చావలేనురా. నీకు వెంటనే చెవిటి మిషను వేయించకపోతే నీతో అరచి అరచి నాకు హార్ట్ ఎటాక్ వచ్చి చచ్చేలా వుంది అని, నెత్తిన పిలక, మొహాన విభూదిబొట్టు, పంచె కట్టుకుని ముక్కుపొడుం పీలుస్తుంటాడు చూడు ఆ తెలుగు మాస్టార్ని పిలుచుకుని చావు అని సైగలు చేసి మరీ చెప్పారు హెడ్ మాస్టారు.

"అలా చెప్ప వచ్చు కదా! దీనికోసం హంగామా చేస్తారు దేనికి?" అని అప్పారావు విసవిసా వెళ్ళిపోయాడు.

రోజు వీడితో సైగలు చేసి చస్తుంటే మూగ భాష వచ్చి చచ్చేలావుంది. కొత్తవాళ్ళెవరైనా చూస్తే మూగ వాడనుకుని చస్తారు. ఖర్మ ఖర్మ అనుకుని నెత్తిన దభీదభీమని బాదుకుని ఇదేదో బాగున్నట్లున్నదే అనుకుని మరో రెండుసార్లు బాదుకుని అమ్మో కళ్లు తిరుగుతున్నాయేమిటి అనుకుంటుండగా తెలుగు మాస్టారు లోపలకొచ్చాడు.

"అవతల క్లాస్‌లో పిల్లలు గోలగోలగా కాకిగోల చేస్తుంటే మీరేం చేసి చస్తున్నారు?" హెడ్‌మాస్టారు కోపంగా చూసి సైగలు చేశాడు.

"అయ్యోరామా! మీకు మాట పడిపోయిందా? ఎవరూ చెప్పలేదేమిటి? ఇంత సడెన్‌గా మాటపడిపోతే ఇది వాతం లక్షణమే. దీనికి విరుగుడు అట్లకాడను ఎర్రగా కాల్చి వంటిమీద నాలుగు వాతలు పెడితే రపీమని తగ్గుతుందని ఎక్కడో చదివిన గుర్తు నన్నాపని చేయమంటారా?" తెలుగు మాస్టారు పిలక సవరించుకుంటూ చెప్పాడు.

హెడ్ మాస్టారు కొరకొరా చూసి చిరాకుగా జుట్టు అందుకుని, బరబర పీక్కున్నాడు.

"అమ్మో! మీకు వాతం ముదిరి పిచ్చి చేష్టలు కూడా కనబడుతున్నాయి దీనికి...

"నువ్వు నోరు మూసుకు చావు. ఆ అప్పిగాడి చెవుడి బాధతో చావలేక వాడికి సైగలుచేసి చేసి ఇలా అలవాటయి చచ్చేలా వున్నాయి. ఆ. హూ" అని దిగాలు పడిపోయి అంతలోనే ఆయన్ని పిలిచిన

మాట గుర్తుకొచ్చి "వెళ్ళిరావు. వెళ్ళి ఆ పిల్లల్ని కాస్త మందిలించి రావండి. పిల్లలు మళ్ళీ అరిచారో సైగలు చేసి చంపుతాను. నేనసలే చండశాసనుడినని తెలుసుకు రావండి" కోపంగా అరిచాడు. తెలుగు మాస్టారు హెడ్ మాస్టార్ మీద కోపంతో గబగబా క్లాస్‌లోకి వెళ్ళాడు.

"ఒరేయ్ ముష్టివెధవల్లారా! జిడ్డు సన్నాసుల్లారా! మీరిలా అల్లరి చేస్తే చంపుతానని వార్నింగ్ యిచ్చాడా హెడ్‌మాస్టారు. ఆయనకే పెద్ద హెడ్ వున్నట్లు మిగతా వారికి లేనట్లు. సైలెన్స్ — సైలెన్స్" అంటూ బెత్తంతో టేబుల్ మీద బాది గొడవ తగ్గిన తరువాత అటెండెన్స్ తీసుకుంటుండగా ఓ కుర్రాడు జారిపోతున్న లాగుని ఎగలాక్కుంటూ, కారుతున్న ముక్కును ఎగపీల్చుకుంటు లోపలికి రాబోయాడు.

"ఆగరా తుంటరి వెధవా! ఏరా నిన్న ఆదివారం కదా అని గురుదక్షిణగా ఒక్క రోజు గేదెల్ని మేపుకు రారా అని కబురు చేస్తే రాలేదేమ్రిటా?" దీర్ఘం తీశాడు తెలుగు మాస్టారు.

"గురుదక్షిణ అంటే ఏమిటి మాస్టారు?" అడిగాడో కుర్రాడు.

"అంటే నేను చెప్పే చదువుకు కానుకన్న మాట" చెప్పాడు తెలుగు మాస్టారు హుందాగా.

అందరూ గొల్లున నవ్వారు. అర్థం కాని మాస్టారు బిత్తరపోయి తెల్ల మొహం వేశాడు.

"మీరు మాకు చదువు చెప్పడం ఏంటి? మీరెప్పుడైనా క్లాస్‌లో పుస్తకం తెరచి పాఠం చెప్పారా? రాగానే హాజరు వేసుకుంటారు. ఆపై ముక్కుపొడుం తీసి గట్టిగా పీల్చుకుని పిలక సవరించుకుంటూ కాలం గడిపేసి మిగతా పాఠం రేపు చెప్పుకుందామని ఎంచక్కా పోతారు" అన్నాడు పిల్లాడు మళ్ళీ జారిపోతున్న లాగుని పైకి లాక్కుంటూ.

"ఒరేయ్, ఒరేయ్ నీకు నక్సలైటు లక్షణాలొస్తున్నాయిరా. నువ్విక బాగుపడవురా సన్నాసి. నీకు చదువెందుకురా బడుద్దాయ్ వెధవ. బడి మానేసి రెండు గేదెల్ని మేపుకుంటే హాయిగా పాలు, పెరుగు, వెన్న, మజ్జిగ మిగిలిన మజ్జిగ పుల్లవారు తాగి బతకొచ్చు" అన్నాడు హేళనగా.

"మీకెప్పుడు తిండిధ్యాస తప్ప పిల్లలకు చదువు చెప్పే ధ్యాసే వుండదు" అన్నాడు మరొక పిల్లాడు గట్టిగా.

"నోరుముయ్. మరీ మీకు నక్సలైట్ల లక్షణాలొస్తున్నాయి. రేపు నక్సలైట్లయితే మీరు నా శిష్యులయినందుకు నన్ను తీసుకెళ్ళి జైలులో పెడతారో ఏమో ఖర్మ".

"మేస్టారండి మీరలా తల మీద బాదుకుంటుంటే అచ్చం తబలా మీద దరువు వేసినట్లున్నది. మరొకసారి బాదుకోండి మాస్టారు" ఓ పాప లేచి బతిమాలింది.


"ఆహా అలాగా తల్లీ. ఇంటికెళ్ళి కుండవలె వున్న మీ నాన్న పొట్ట మీద వాయించుకో. కూర్చో" కసురుకున్నాడు తెలుగు మాస్టారు.

"మాటిమాటికీ నా లాగు జారిపోతున్నది తీసి అవతల పారేస్తాను" అన్నాడా కుర్రాడు.

"ఛ ఛ. ఈకాలపు పిల్లలకు మరీ నక్సలైట్ల అలవాట్లు ఎక్కువైపోతున్నాయి. ఒరేయ్ ఇది బందుల దొడ్డి కాదురా బాబూ! ఈ రోజుకు అలాగే అడ్జస్ట్ అయిపోయి రేపు వచ్చేటప్పుడు లాగు జారిపోకుండా రెండు మేకులు దిగేసుకురా వచ్చి కూర్చుని ఏడువ్" అన్నాడు మాస్టారు.

"మాస్టారండి నాకు ఒంటేలు వస్తావుందండి' అన్నాడో కుర్రాడు.

"ఇంకా ఆలస్యం దేనికి వెళ్ళు అనగానే మరో పాప లేచింది. "ఏమ్మా నీకు రెండేళ్ళు కొస్తున్నదా?" అన్నారు మాస్టారు వ్యంగ్యంగా.




"కాదండి ఆకలవుతున్నది" అన్నదా పిల్ల.

"అయితే నన్ను తిను తల్లీ".

"మిమ్మల్ని తినడం పాపం కదండి. అయినా మేము మనిషి మాంసం తినమండి" అన్నది అమాయకంగా మొహంపెట్టి.

"అమ్మో అమ్మో కాలం ఎంత మారిపోయింది ఆడపిల్లలలో కూడా నక్సలైటు లక్షణాలు మరీ ముంచుకొస్తున్నాయి. వీరిని బాగుచేయడం నావల్ల కాదు.

బెల్ అయిన తరువాత వెళుదువు కూర్చో తల్లి. పిల్లలూ! ఆ మధ్య ఎప్పుడో చెప్పిన పాఠం అప్పచెప్పండరా!" అన్నాడు.

ఎవరూ మాట్లాడలేదు.

"అందరూ చదివారా?" అన్నాడు.

"చదివామండి" అన్నారంతా కోరస్‌గా.

"ఒరేయ్ నువ్వు అప్పచెప్పు".

"మీరసలు నెలకొక్క పాఠం కూడా చెప్పరు. అలాంటిది అప్ప చెప్పించుకుంటారని మేమేమైనా కలకంటామా? అందుకే చదవలేదు" అన్నాడతను.

"ఎంత గొప్ప వాళ్ళురా మీరు. రేపటి భావి భారత పౌరులు మీరే".

"మేస్టారండి వీడు నా పుస్తకం చింపాడండి" కంప్లయింట్.

"ఎవడా వెధవ. చదువుకునే సన్నాసి ఎవడు పుస్తకం చింపి చావడు. ఎవ్వడ్రా నీకు చదువు చెప్పే వెధవ?" అని నాలుక కరుచుకునేటప్పటికి "మీరే కదండి" అరిచాడొకుర్రాడు వెనక బెంచీలోనుండి.

"ఎవ్వడ్రా అరచిన గాడిద కొడుకు. తిత్తు తీస్తాను వెధవను".

"మీ అబ్బాయేనండి."

"అమ్మో! కాలం మారిపోయిందిరోయ్ నాయనా! వీళ్ళకు చదువెలా చెప్పాలిరా భగవంతుడా? ఈ నక్సలైట్లుగా తయారయ్యే పిల్లలకు చెప్పడం కంటే అడవిలో మానై... కాదు కాదు అడవిలో నక్సలైటయి పోవడం బెటరు" అంటుండగా హెడ్ మాస్టార్ విజిట్‌కొచ్చి తెలుగు మాస్టారు ఆఖరిమాటలు విన్నారు. పిల్లలకు నాలుగు విద్యాబుద్ధులు చెప్పమంటే ఇప్పటినుండే వారిలో విప్లవభావాలు రేపి, వారిని నక్సలైట్లవలె తయారుచేస్తావా? నాకు తిక్క రేగిందంటే నిన్ను పోలీసులకప్పగించి విరగబాదించి, జీవితాంతం జైలులో పెట్టించి చిప్పకూడు తినిపించి చంపుతాను. అసలు... అని హెడ్ మాస్టారు సైగలు చేసి చెబుతుంటే, తెలుగు మాస్టారు మోకాళ్ళ మీద వంగి "అయ్యా తలకాయ మాస్టారు క్షమించాలి. హెడ్‌మాస్టారు. మీరలా సైగలు చేసి మరీ వివరిస్తుంటే నాకు కడుపులో దేవుతున్నట్లుగా వుంది. అప్పిగాడికి నా డబ్బులతో చెవిటి మిషను వేయిస్తాను. వాడిమీద కోపంతో మిమ్మల్ని బాధించడం ఏం బాగాలేదు. దయచేసి కాస్త మాట్లాడండి" అంటూ సాష్టాంగ పడ్డాడు తెలుగు మాస్టారు.

(పాఠకులూ! మిమ్మల్ని చూస్తుంటే ఆ హెడ్ మాస్టారు చేతిలో చావాలని, ఆయన సైగల్ని తనివి తీరా చూడాలని ఉబలాట పడుతున్నట్లనిపిస్తున్నది. ఆయన అడ్రస్ మీక్కావాలంటే నాకు లెటరు గీకక తప్పదు మరి. ఎవరు ముందుగా గీకితే వాళ్ళకే ఛాన్స్ మరి. మహర్షి, 38, నాగార్జున హిల్స్, పంజాగుట్ట, హైదరాబాద్—482.)